సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



భరోసా ఇచ్చి.. బాధితులను మరచి..

సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చెందిన వందలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ బాధితులకు భరోసా లేకుండా పోయింది.


8 లో



అన్నవరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ (సికింద్రాబాద్) సుహాసిని ఎస్.గోత్మారే గురువారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు.

1.70 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 1,70,803 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,700 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

భీమేశ్వరస్వామికి రూ.38.08 లక్షల ఆదాయం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. దేవదాయశాఖ రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపులో 53 రోజులకు గాను రూ.38,08,336 ఆదాయం వచ్చినట్లు ఈఓ దుర్గా భవాని తెలిపారు. ఈ నెల 23న దాత అనుసూరి మహాలక్ష్మి ఒకేసారి రూ.30 లక్షలు హుండీలో వేయడంతో భద్రతా కారణాల రీత్యా తక్కువ కాలానికే హుండీల ఆదాయాన్ని లెక్కించాల్సి వచ్చిందని ఈఓ తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, ముప్పనపల్లి గణేష్, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, పెంకే సాంబశివరావు, అల్లం రామకృష్ణ, ఆళ్ల బుజ్జి, నవీన్, కర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సమన్వయంతో పని చేయాలి

జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

సాక్షి, అమలాపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ పైప్‌లైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే అరికట్టే దిశగా చమురు సంస్థలు, జిల్లా అగ్నిమాపక స్పందన సంస్థలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, జిల్లా అగ్నిమాపక స్పందన సంస్థ అధికారులతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. చమురు సహజ వాయువుల వనరుల లభ్యత ప్రాంతాలు వాటికి అనుబంధంగా ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్‌లైన్లు, ఇంటర్మీడియెట్ స్టేషన్లు, గ్యాస్ వినియోగించే కంపెనీలు, గ్యాస్ లీకేజీల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని చమురు గ్యాస్ నిక్షేపాలను వెలికి తీసి సరఫరా చేస్తున్న సంస్థలు ఆయా పైప్‌లైన్లను మ్యాపింగ్ చేసి జిల్లా అగ్నిమాపక స్పందన సంస్థల స్టేషన్‌లో అందించాలన్నారు. దీని ద్వారా లీకేజీ సమయంలో ఫిర్యాదు అందిన వెంటనే ఆయా ప్రాంతాలను సులభంగా గుర్తించి గ్యాస్ మంటలను త్వరితగతిన అదుపులోకి తెచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. జంక్షన్ పాయింట్లు, ఇంటర్మీడియెట్ స్టేషన్ తదితర లీకేజీలు ఏర్పడడానికి అవకాశం ఉన్న స్పాట్లను మ్యాపింగ్ చేస్తూ నివేదిక రూపొందించాలని గ్యాస్ చమురు సంస్థలను ఆదేశించారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా పైప్‌లైన్లు నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్ట పరచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక విపత్తు స్పందన అధికారి ఎన్.పార్థసారథి, గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ సుందర్ కుమార్, సీనియర్ ఫైర్ సేఫ్టీ అధికారి అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కారు అమ్ముతానని రూ.3 లక్షలకు టోకరా

తాడేపల్లిగూడెం అర్బన్ : కారు విక్రయానికి పెట్టి రూ.3 లక్షలకు ఓ న్యాయవాది టోకరా వేసినట్టు సమాచారం. వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన ఓ న్యాయవాది తన కారును ఆన్‌లైన్ ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి కారు ఫొటోతో వివరాలు తెలియచేశాడు. మండపేటకు చెందిన ఓ వ్యక్తి ఓఎల్‌ఎక్స్‌లో ఆ కారును చూసి తాడేపల్లిగూడెం వచ్చి కారు యజమానితో చర్చించి రూ.3 లక్షలు అడ్వాన్సు ఇచ్చాడు. ఆ తరువాత రోజు మిగిలిన సొమ్ములు చెల్లించేందుకు రాగా అక్కడ కారు లేదు. దీంతో యజమానిని అడుగగా తన స్నేహితులు కారులో విజయవాడ వెళ్లారని తరువాత రోజు ఉదయం వస్తారని చెప్పాడు. దీంతో మండపేట వాసి వెళ్లి మూడవ రోజ వచ్చాడు. తన స్నేహితులు ఇంకా రాలేదని తరువాత రోజు వస్తారని చెప్పాడు. ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పడంతో తాను మోసపోయానని మండపేట వాసి గ్రహించి తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టణ పోలీసులు ఇద్దరినీ పిలిచి సంధి చేసినట్లు తెలిసింది.

సమ్మెస్యలు

- డాక్టర్ల సమ్మెతో రోగులకు పాట్లు
- జీఓ 85 రద్దుపై స్పందించని ప్రభుత్వం
- ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్న వైద్యులు
- అక్కరకు వచ్చిన ఎంఎల్‌హెచ్‌పీల నియామకం

అలమూరు: వాతావరణంలో మార్పులు, భారీ వర్షాలతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. అంటువ్యాధులు వ్యాప్తి చెందడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గడంతో అనేక మంది రోగులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు జీఓ నంబరు 85 రద్దు కోరుతూ చేస్తున్న సమ్మె రోగుల పాలిట శాపంగా మారుతోంది. ఇటు ప్రభుత్వం సమ్మెపై స్పందించకపోవడం, డిమాండ్లను పరిష్కరించుకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని వైద్యుల ప్రకటించడంతో సమస్య మరింత జటిలంగా మారింది. దీంతో పేద, మధ్య తరగతి రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

రోజుకు 6 వేల మందికి వైద్య సేవలు

జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో 100 నుంచి 150 మంది రోగులు ఓపీ విభాగంలో నమోదు చేసుకోగా ప్రతిరోజూ సుమారు ఆరు వేల మంది వరకూ వైద్య సేవలు పొందుతుంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 56 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు సామాజిక ఆసుపత్రులు, రెండు ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అందులో 49 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న 112 మంది వైద్యులు ఈ నెల 17 నుంచి ప్రభుత్వం రెండు నెలల క్రితం జారీ చేసిన జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో వైద్యులు సమ్మెను యథావిధిగా కొనసాగిస్తున్నారు. గత పది రోజుల నుంచి సమ్మె చేస్తున్న పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను ఇప్పటి వరకూ ప్రభుత్వం పరిష్కరించలేదు. దీంతో వైద్యులు విధులకు హాజరు కావడం లేదు. ఇది పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సమ్మె గురించి తెలియక అనేక మంది రోగులు పీహెచ్‌సీలకు వచ్చి ఉసూరు మంటూ వెనుదిరిగి పోతున్నారు. గ్రామాల్లో

జీఓ 85 రద్దు డిమాండ్ ఎందుకంటే..

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తరువాత పీహెచ్‌సీ వైద్యులకు తీవ్ర నష్టం కలిగించే జీవో నంబర్ 85ను జారీ చేసింది. దీంతో వైద్య ఆరోగ్యశాఖలో అమలులో ఉన్న క్లీనికల్ సీట్ల విభాగంలో సీట్ల కోటా 30 శాతం నుంచి 15 శాతానికి, నాన్ క్లీనికల్ విభాగంలో 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గిపోయింది. అలాగే గతంలో ఉన్న 19 కేటగిరీల రిజర్వేషన్లను ఆరు కేటగిరీలకు కుదించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ వివాదాస్పద జీవోను ఉపసంహరించుకునే వరకూ నిరసనలు కొనసాగిస్తామంటూ పీహెచ్‌సీ వైద్యులు నిరవధిక సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ నోటీసుకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మె చేస్తూ విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ జీవో వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని, పాత విధానాన్నే కొనసాగించాలని వైద్యులు డిమాండు చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన వైఎస్సార్ క్లీనిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) వ్యవస్థలో నియమించిన మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) వ్యవస్థ ఈ సమయంలో రోగులకు స్వాంతన చేకూర్చుతోంది.

ఎంఎల్‌హెచ్‌పీల సహకారంతోనే వైద్య సేవలు

పది రోజుల నుంచి వైద్యులు నిరవధిక సమ్మె చేస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించేందుకు కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గత



పెనికేరులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రభుత్వం నియమించిన ఎంఎల్‌హెచ్‌పీలు స్థానిక ఆరోగ్య, ఆశ సిబ్బంది సహకారంతో వైద్య సేవలను అందిస్తూ అవసరమైన మాత్రలను పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నవారిని సత్వరమే సమీప సీహెచ్‌సీలకు, ఏరియా అస్పత్రులకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. పీహెచ్‌సీల్లోని వైద్యారోగ్య సిబ్బంది కేవలం మధుమేహం, రక్తపోటు పరీక్షలకే పరిమితమవుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో విషజ్వరాల బారిన పడిన వారు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. జిల్లాలో ప్రతిరోజూ వేలాది మంది రోగులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



పీహెచ్‌సీలో వైద్య సేవల కోసం ఎదురు చూస్తున్న రోగులు

వైద్యులు అందుబాటులో ఉండటం లేదు



పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక విలవిల్లాడిపోతున్నాం. దీనిపై ప్రభుత్వం సత్వరమే స్పందించి రోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– షేక్ రజియా, పెదపళ్ల, ఆలమూరు మండలం

వైద్య సేవలను నిర్లక్ష్యం చేయడం సరికాదు



విష జ్వరంతో బాధపడుతున్న నేను ఆస్పత్రికి వస్తే అక్కడి సిబ్బంది డాక్టర్లు లేరని చెబుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యం చేయకుంటే ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న మరో ఆస్పత్రికి వెళ్లాలని సిబ్బంది సూచిస్తున్నారు. 75 ఏళ్ల వయస్సులో అంతదూరం వెళ్లి చికిత్స చేయించుకోలేకపోతున్నాను.

– నేరేడుమిల్లి వీర్రాజు, చింతలూరు, ఆలమూరు మండలం

ఆయుష్మాన్ మందిర్ ద్వారా వైద్య సేవలు



ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చిన రోగులకు మా పరిధి మేరకు సేవలు అందిస్తున్నాం. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నాం. వ్యాధి తీవ్రత ఉన్న వారిని గుర్తించి ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తున్నాం. పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆయుష్మాన్ భారత్‌కు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది.

– వి.సువర్చల, ఎంఎల్‌హెచ్‌పీ, మండపేట

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ అన్నారు. డొక్కా సీతమ్మ ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ముంగండలో గురువారం సంఘ చైర్మన్ ఆరుమిల్లి లాల్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. 300 మంది సభ్యులతో తమ సంఘం ప్రారంభమైందని చైర్మన్ లాల్‌బాబు వివరించారు. అఖిల భారతీయ కిసాన్ సంఘ్ కార్యకారిణి సభ్యుడు జలగం కుమారస్వామి, కృషీవల సంఘ అధ్యక్షుడు గణపతి రాఘవులు, నాయకులు ముత్యాల జమీలు, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ కొబ్బరి, ఉప ఉత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఉద్యాన శాస్త్రవేత్త కిరీటి, రైతు సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, అడ్డాల గోపాలకృష్ణ, వాసంశెట్టి కుమార్, చెరుకూరి గోపాలకృష్ణ, యర్రంశెట్టి సాయిబాబు పాల్గొన్నారు.

అమలాపురం వెంకన్న సన్నిధిలో రేపు వైఎస్సార్ సీపీ శ్రేణుల పూజలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు

అమలాపురం టౌన్: తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుపై ఆ పార్టీ అమలాపురం నియోజకవర్గ నేతలు గురువారం చర్చించారు. అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం పూజలు చేయాలని సమావేశంలో నిర్ణయించి తీర్మానం చేశారు. స్థానిక సూర్యనగర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ మేరకు చర్చించి పూజల ఏర్పాట్లకు సన్నాహాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, కొనుకు గౌతమి, అమలాపురం రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు బొంతు గోవిందశెట్టి, కొనుకు బాపూజీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి బాబు ప్రసంగించారు. శనివారం ఉదయం 8.30 గంటలకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అమలాపురం హైస్కూల్ సెంటరుకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. తొలుత సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం అక్కడ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకూ పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

పనైనా చెప్పండి.. తిండైనా పెట్టండి



అమలాపురంలో భరతమాత విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్ల అసోసియేషన్ ప్రతినిధులు

- అక్టోబర్ 2 వరకూ ఆందోళనలకు పిలుపునిచ్చిన వలంటీర్లు
- అమలాపురంలో భరత మాత విగ్రహానికి వినతి పత్రం అందజేత

అమలాపురం టౌన్: మాకు పనైనా చెప్పండి... తిండైనా పెట్టండి అనే నినాదంతో గ్రామ వలంటీర్లు శాంతియుత ఆందోళనకు దిగారు. ఈ మేరకు గురువారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ గాంధేయ మార్గంలో శాంతియుతంగా నిరసన తెలపాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భరతమాత విగ్రహానికి వలంటీర్ల యూనియన్ నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. పనైనా చెప్పండి...తిండైనా పెట్టండి అని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన ఉద్యోగ భద్రత, రూ.10 వేల వేతనం హామీలు తక్షణమే నెరవేర్చి తమను విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తొలుత జిల్లా సచివాలయ వలంటీర్ల అసోసియేషన్ గౌరవ చైర్మన్ సత్తిబాబు అధ్యక్షతన అమలాపురంలో సంఘ సమావేశం నిర్వహించారు. గాంధేయ మార్గంలో చేపట్టే ఆందోళనలకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ గౌరవ చైర్మన్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, వలంటీర్ల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఎం.సతీష్, అమలాపురం పట్టణ అసోసియేషన్ ఇంచార్జి వీవీ ఆనంద్, జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హెల్త్ ఇన్సూరెన్స్

కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు, అనాథాశ్రమాలు, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం ద్వారా రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకూ ప్రమాద బీమా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంక్షేమ శాఖల అధికారులు, వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం రూపకల్పన, అమలు విధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల అనాథ ఆశ్రమాలు, సంక్షేమ వసతి గృహాల్లో పాము కాట్లు, ఫుడ్ పాయిజన్ వంటి ప్రమాదాలు తరచూ సంభవిస్తున్న నేపథ్యంలో హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్ కోసం ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధులతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకే ప్రతి ఆసుపత్రికి ముఖ్యంగా క్యాజువల్ వార్డు సీసీ కెమెరాలు అమర్చి, దానిని త్వరలో కలెక్టరేట్‌లో నెలకొల్పే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల డేటాను ఆయా పరిధిలోని పోలీస్ స్టేషన్లకు మ్యాపింగ్ చేయాలని సూచించారు. వైద్యులు జవాబుదారీతనంతో వైద్య సేవలు అందించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రతికూల వార్తలకు తావివ్వకుండా అంకితభావం క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్సు కోసం అన్ని సంస్థల్లో కలిపి 7,500 మంది ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి.కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అత్యవసర వైద్య సేవలు మ్యాపింగ్ ప్రత్యేకంగా రూపొందించాలని, సీసీ కెమెరాలు నిత్యం పనిచేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు వీవీఎస్ ఎన్ మూర్తి, పీఎస్‌శర్మ, డీసీహెచ్‌ఎస్ కార్తిక్, డీఎంహెచ్ఓ.దుర్గారావు దొర, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, ఐసీడీఎస్ అధికారులు విజయశ్రీ, రమణి, ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర ఘనం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం

- ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల నిర్వహణలో డొల్లతనం
- పాలక వర్గం, దాతల కుటుంబాల మధ్య విభేదాలు
- అయోమయంలో విద్యార్థులు
- జీతాల కోసం అధ్యాపకుల దీక్షలు
- ప్రస్తుత పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు



మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల డిగ్రీ కళాశాల

మలికిపురం: సుమారు 85 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన స్థానిక అంతర్వేదిపాలెం ఫిర్కా డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఏఎఫ్‌డీటీ) విద్యా సంస్థల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల బిల్డింగ్ ఫండ్, దాతలు ఇచ్చిన విరాళాలు, నాక్ గుర్తింపు, ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఈ విద్యా సంస్థలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. తాజాగా పాలకవర్గం, దాతల కుటుంబాల మధ్య తలెత్తిన వివాదం, నిధుల దుర్వినియోగం, బైలాకు విరుద్ధంగా ఉన్న పాలకవర్గం నిర్ణయాలతో తలెత్తిన వివాదం చినికిచినికి గాలివానలా మారి నేడు విద్యా సంస్థల నిర్వహణపై పడింది.

1940లో ఏర్పాటు

విద్యపై అవగాహన ఉన్న దాతలు 1940లో చందాలు వేసుకుని ఏఎఫ్‌డీటీ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. తదనంతర కాలంలో అది ఇంటర్మీడియెట్ స్థాయికి చేరింది. 1972లో ఈ విద్యా సంస్థలో భాగంగానే ఎంవీఎస్ జీఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల ఏర్పడింది. నియోజకవర్గంలోని లక్కవరం మంగెన కుటుంబీకులు, గుడిమూల రుద్రరాజు కుటుంబీకులు, మోరిజాన, మోరిపోడు ముప్పర్తి కుటుంబీకులు, గూడపల్లి ఓగూరి కుటుంబీకులు ఈ విద్యాసంస్థ అభివృద్ధిలో కీలకంగా ఉన్నారు. ఆ కుటుంబాల్లోని వ్యక్తులే పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించారు. ప్రైవేటు విద్యా సంస్థ కాస్తా 1989లో పాలకవర్గంలో ఉన్న మంగెన కుటుంబం నుంచి మంగెన గంగయ్య ఎమ్మెల్యే కావడంతో విద్యా సంస్థల కరస్పాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి హయాంలో ఈ విద్యా సంస్థలను గంగయ్య ఎయిడెడ్ విద్యా సంస్థలుగా గుర్తించి ప్రభుత్వ సాయం అందించింది. కళాశాల అధ్యక్షులుగా ఉన్న అల్లూరు కృష్ణంరాజు కూడా 2004లో ఎమ్మెల్యే కావడంతో ప్రభుత్వ సాయం అందింది. ఫలితంగా రూ.100 కోట్ల ఆస్తులను కలిగి 1200 మందికి పైగా విద్యార్థులతో నడిచే ఈ విద్యా సంస్థపై గంగయ్య, కృష్ణంరాజు మృతి అనంతరం నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈ విద్యా సంస్థల్లో కీలకంగా వ్యవహరించే ఎన్‌సీసీ కుటుంబానికి చెందిన జంపన సత్యనారాయణరాజు సైతం ప్రస్తుత వివాదంలో సైలెంట్‌గా ఉన్నారు.

వివాదం ఇలా...

ప్రభుత్వ ఎయిడెడ్‌గా ఉన్న ఈ విద్యా సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేయాలని... లేకుంటే స్వతంత్రంగా నిర్వహించుకోవచ్చని గత ప్రభుత్వం సూచించింది. అప్పటి పాలకవర్గం దీనిని ప్రభుత్వానికి అప్పగిస్తూ లెటర్ ఇచ్చింది. అక్కడి నుంచి వివాదం మొదలైంది. పూర్తి పాలకవర్గం ప్రమేయం లేకుండా అరకొర సభ్యుల సంతకాలతో ప్రభుత్వం పరం చేశారని దాతల, వ్యవస్థాపక కుటుంబాల సభ్యులు కోర్టును ఆశ్రయించారు. మృతి చెందిన పాలకవర్గ సభ్యులు మంగెన గంగయ్య, ఓగూరి వసంతరావు స్థానాల్లో కొత్త సభ్యుల నియామకం జరగలేదు. మోరిపోడుకు చెందిన ముప్పర్తి రాఘవేంద్ర విదేశాలలో ఉండగా ఆయన సంతకం ఫోర్జరీ చేశారని వ్యవస్థాపక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాక కళాశాలకు చెందిన నిధులు దుర్వినియోగం చేశారని, కళాశాల ప్రాంగణంలో షాపింగ్ మాల్ నుంచి వచ్చే అద్దె లెక్కలు తేల్చాలనే ఫిర్యాదు చేశారు. ఈ లెక్కల నుంచి తప్పించుకునేందుకే హడావుడిగా ప్రభుత్వపరం చేశారని ఆరోపణలు ఉన్నాయి. . కాగా అవినీతి ఆరోపణలపై ఇటీవల అధికారులకు విచారణ ఆదేశించారు. పది రోజుల్లో విచారణను పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు.

పాలకవర్గం రద్దు చేయాలని డిమాండ్

విద్యాసంస్థల ప్రస్తుత పాలకవర్గాన్ని రద్దు చేయాలని దాతలు, వ్యవస్థాపక కుటుంబాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. బైలాకు విరుద్ధంగా ప్రస్తుత పాలకవర్గం కొనసాగుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థను ప్రభుత్వ పరం చేయాలంటే 2:3 మెజారిటీతో ఆమోదం పొందాలి. అనంతరం పాలకవర్గం ఏకగ్రీవంగా లేఖ రాయాలి. కాని అలా జరగలేదని, బైలాకు విరుద్ధంగా పూర్తిస్థాయి కమిటీ లేని పాలక వర్గాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వంపరమైన తరువాత విద్యాసంస్థ పాలక వర్గం రద్దవుతుంది. కానీ ఇక్కడ కొనసాగడం గమనార్హం. గతనాలుగు నెలలుగా జీతాలు లేక అధ్యాపకులు రోడ్డెక్కారు. ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం గాని, ప్రభుత్వం కాని జీతాలు ఇవ్వడం లేదు. విద్యా సంస్థలో విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పండింది. సిలబస్ పూర్తికాక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు


విచారణకు ఆదేశించాం



మలికిపురం ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థలపై ఆరోపణలు రావడంతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విచారణకు ఆదేశించింది. విచారణ నివేదిక వచ్చిన తరువాత కళాశాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటాం. విద్యాసంస్థల ఆస్తులు, విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం. సిబ్బంది జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తాం.

– దేవ వర ప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

బైలాకు విరుద్ధంగా పాలక వర్గం



ఏఎఫ్‌డీటీ విద్యాసంస్థల పాలకవర్గం ప్రభుత్వ బైలాకు విరుద్ధగా నడుస్తోంది. పూర్తి పాలకవర్గం లేదు. ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. కళాశాలలో నిధులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే చెప్పడం లేదు. అవినీతి జరిగిందని భావిస్తున్నాం. ఎంతో పేరున్న విద్యా సంస్థను కాపాడాలి. కళాశాల ఆదాయం, నిల్వ, ఖర్చులను ప్రజలకు తెలియజేయాలి.

– మంగెన నాగ భూషణం, దాతల కుటుంబాల ప్రతినిధి, లక్కవరం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

తాళ్లరేవు: చొల్లంగిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పి.మహేష్, పి.పుష్పలత, ఆర్.వీరశ్రావణి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ పీడీ నీలిమ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 19న జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–19 బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు నవంబర్ నెలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ నీలిమను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, స్కూల్ హెచ్ఎం వి.రాజేశ్వరి, హైస్కూల్ పీఎంసీ చైర్మన్ డి.గంగాభవాని, ఉపాధ్యాయులు అభినందించారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

సామర్లకోట: మతిస్థిమితం లేని మహిళను అత్యాచారం చేసిన ఘటనలో ముద్దాయి చింతపల్లి నూకరాజుకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారు. ఈ విషయాన్ని సామర్లకోట సీఐ ఎ.కృష్ణభగవాన్ గురువారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. వివరాల్లోకి వెళితే... 2019లో మతిస్థిమితం లేని మహిళను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ముద్దాయి అత్యాచారం చేశాడు. దాంతో బాధితురాలి మేనత్త కుమారుడు ఎం.తరుణ్‌కుమార్ అప్పటి ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ వి.శ్రీనివాసు కేసు దర్యాప్తు చేసి నూకరాజును అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చారు. కోర్టులో పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు ఫిర్యాదుదారు తరఫున వాదనలు వినిపించారు. కోర్టు ట్రయిల్ సమయంలో ప్రతిభ కనబర్చిన హెచ్‌సీ బీఎన్ రాజును జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ కృష్ణభగవాన్ తెలిపారు.

భరోసా ఇచ్చి.. బాధితులను మరచి..

- జయలక్ష్మి సొసైటీ బాధితులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు భరోసా, సానుభూతి ప్రకటనలు
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులను కలసి న్యాయం చేయాలని కోరిన పాలకవర్గం
- రూ.520 కోట్ల డిపాజిట్లపై లోపించిన జవాబుదారీతనం
- గత ప్రభుత్వంలో సిట్ ఏర్పాటు, సీఐడీ విచారణ, నిందితుల అరెస్టు
- నేడు కాకినాడలో తృతీయ మహాజన సభ



సర్పవరం జంక్షన్‌లో జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ మెయిన్ బ్రాంచ్ వద్ద బాధితుల అర్ధనగ్న ప్రదర్శన (ఫైల్)



జయలక్ష్మి సొసైటీ మెయిన్ బ్రాంచ్‌లో మూడో మహాజన సభ గురించి సమీక్షిస్తున్న నూతన పాలకవర్గ చైర్మన్ త్రినాథరావు, డైరెక్టర్లు

కాకినాడ రూరల్: సామాన్య, మధ్యతరగతి ప్రజలకు చెందిన వందలాది కోట్ల రూపాయలు దుర్వినియోగం చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ బాధితులకు భరోసా లేకుండా పోయింది. తమ సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియని బాధితులు రోజులు లెక్కపెడుతూ కాలం గడుపుతున్నారు. సుమారు రూ.20 వేల మంది సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ 2022 మార్చి 31న జయలక్ష్మి సొసైటీ బోర్డు తిప్పేసింది. వడ్డీ సొమ్ముతో శేష జీవనం గడపవచ్చని కొందరు, పిల్లల భవిష్యత్తు కోసం మరి కొందరు, అధిక వడ్డీలకు ఆశపడి మరి కొందరూ ఇలా రూ.520 కోట్ల మేర జయలక్ష్మి సొసైటీకి చెందిన రాష్ట్రంలోని 6 జిల్లాల పరిధిలోని 29 బ్రాంచుల్లో గతంలో సొమ్ములు డిపాజిట్ చేశారు. వారందరికీ గత పాలకవర్గం షాక్ ఇస్తూ బోర్డు తిప్పేడంతో నేటికి పైసా కూడా దక్కలేదు. ఎన్నికలకు ముందు జయలక్ష్మి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చిన కూటమి నేతలు అధికారంలో వచ్చి 100 రోజులు గడిచినా పట్టించుకున్న దాఖలాలు లేవు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ తదితరుల చుట్టూ నూతన పాలకవర్గం ప్రదర్శనలు చేస్తూ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా ఇప్పటికీ చలనం లేదు.

వసూళ్లు కేవలం రూ.4.86 కోట్లు మాత్రమే..

జయలక్ష్మి సొసైటీ సొసైటీ సభ్యులను నట్టేట ముంచి బోర్డు తిప్పేయడంతో 2022 అక్టోబర్ 3న మహాజన సభ ద్వారా నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. గంగిరెడ్డి త్రినాథరావు చైర్మన్‌గా, పీవీ రమణమూర్తి వైస్ చైర్మన్‌గా, ఏవీఎస్ రవికుమార్ కోశాధికారిగా, మరో ఏడుగురు డైరెక్టర్లుగా పగ్గాలు చేపట్టారు. వీరంతా వసూళ్ల కోసం పట్టువదలని విక్రమార్కుల్లా ప్రయత్నాలు చేస్తున్నా రుణాలు తీసుకున్న వారి నుంచి చలనం లేదు. సుమారు రూ.580 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కేవలం రూ.4.86 కోట్లు మత్రమే నగదు రూపంలో ఉంది. మరో రూ.6 కోట్లు ఆస్తులు సీజ్ చేయడంతో జమ అయిన సొమ్ములు ఉన్నాయి. రెండూ కలిపితే రూ.10 కోట్లు వరకూ మాత్రమే ఉండడంతో సభ్యులకు ఏ విధంగా ఇవ్వాలో తెలియని పరిస్థితి నెలకొంది.

బాధితులకు అండగా గత ప్రభుత్వం

సర్పవరం జంక్షన్ వద్ద ప్రధాన బ్రాంచ్‌తో పాటు 29 బ్రాంచీలు కలిసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం పట్ల గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచింది. జయలక్ష్మి ఏఎంఏ సొసైటీ అప్పటి చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్‌పర్సన్ బద్రి విశాలాక్షి తదితరులను అరెస్టు చేసి జైలుకు పంపింది. జయలక్ష్మి వ్యవహారంపై మాజీ సీఎం జగన్ సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. సిట్ నివేదికలో డిపాజిటర్ల సొమ్ములు దుర్వినియోగం, రుణ గ్రహీతల వివరాలు పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించడంతో సీఐడీ విచారణకు ఆదేశించింది. సీఐడీ అధికారులు 84 కేసుల్లో రూ.300 కోట్ల మేర ఆస్తులకు చార్జ్ షీట్ దాఖలు చేశారు. మరో 110 కేసుల్లో రూ.200 కోట్ల మేర ఆస్తుల సీజ్‌కు నివేదించగా ఇందుకు సంబంధించి జీఓ నేటికీ ప్రస్తుత హోం మంత్రి వద్ద పెండింగ్‌లో ఉంది. సిట్ నివేదిక ఆధారంగా నూతన పాలకవర్గం డిస్‌ప్యూట్ సెటిల్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి 465 కేసులకు రూ.497 కోట్లకు ఒక కేసుగా సివిల్ కోర్టులోనూ, వాటిలోనే మరో 190 కేసులను కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌లో వేశారు.

మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాలి

జయలక్ష్మి సొసైటీ ద్వారా అందించిన రుణాల్లో రూ.123 కోట్లు మాత్రమే సెక్యూర్డ్ రుణాలు అన్‌సెక్యూర్డ్‌గా ఉన్నాయి. కొన్ని రుణాలకు డాక్యుమెంట్లు లేవు. బినామీల పేరిట కొల్లగొట్టారు. అన్‌సెక్యూర్డ్ లోన్లు సుమారు 400గా గుర్తించగా 365 మంది వ్యక్తులు ఉన్నారు. అన్‌సెక్యూర్డ్ రుణాలను ఎక్కువ మొత్తంలో గత పాలవర్గ చైర్మన్, వైస్ చైర్మన్, వారి కుమారుడు కలిసి దుర్వినియోగం చేసినట్టు అప్పట్లో ప్రాథమికంగా గుర్తించారు.

నేడు మూడో మహాజన సభ

జయలక్ష్మి సొసైటీ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో 3వ మహాజన సభను శుక్రవారం కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేయనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఐదేళ్లకు గత సభలో తీర్మానం చేశారు. ఇప్పటికే రెండేళ్ల పదవీ కాలం ముగియనున్న డైరెక్టర్ల పదవీ కాలం పొడిగింపు, నూతన కార్యవర్గం ద్వారా సొసైటీ కార్యకలాపాల పురోగతిపై చర్చించనున్నారు.

కాళ్లు అరిగేలా తిరుగుతున్నాను



మా మనవడి యూఎస్ చదువుల కోసం కుమార్తె స్థలం విక్రయించడం ద్వారా వచ్చిన సొమ్ములు, నేను కష్టపడిన సొమ్ములు కలిపి రూ.కోటి డిపాజిట్ చేశాను. జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం నిండా ముంచింది. సొమ్ములు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి. ప్రభుత్వం చొరవ చూపించి బాధితులను ఆదుకోవాలి.

–జి.జానకి, జయలక్ష్మి సొసైటీ బాధితురాలు, కాకినాడ

బాధితులకు అండగా ఉంటాం



జయలక్ష్మి సొసైటీ బాధితులకు అండగా ఉంటాం. మొండి బకాయిల వసూళ్లకు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాం. ఆస్తులు విక్రయానికి అనుమతులు వస్తాయని ఎదురు చూస్తున్నాం. జయలక్ష్మి సొసైటీ బాధితుల దుస్థితిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాం. వారు సత్వరమే స్పందించి న్యాయం చేసేలా చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాం.

– గంగిరెడ్డి త్రినాథరావు, జయలక్ష్మి సొసైటీ నూతన పాలకవర్గ అధ్యక్షుడు

లడ్డూ పేరుతో ఆటలాడొద్దు

- సీబీఐ విచారణతో నిగ్గు తేల్చండి
- జగన్‌ను నిందించడానికే ఆరోపణలు
- కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత



కాకినాడ: ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం విషయంలో ఆటలు ఆడవద్దని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ హితవు పలికారు. నిజాలు నిగ్గుతేల్చాలంటే సీబీఐతోగానీ, సిటింగ్ జడ్జితో కానీ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సరైన సాక్ష్యాధారాలు లేకుండా లడ్డూ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్న తీరు వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ నిర్వహణను ప్రత్యేక బోర్డు, కమిటీలు పర్యవేక్షిస్తాయన్నారు. రాజకీయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నిందలు వేసేందుకే ఈ అంశంపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తప్పు జరిగి ఉంటే శిక్ష పడాల్సిందేనని మాజీ సీఎం జగన్ కూడా తన వైఖరి స్పష్టం చేసినందున నిఘా నిజాలు నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలని ఆమె కోరారు. మొక్కుబడి తంతుగా కాకుండా ఉండాలంటే సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణ చేయించడం అవసరమన్నారు. ఎంతో భక్తిభావం కలిగి మానవ సేవే మాధవసేవగా భావించే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అటువంటి జగన్ అత్యంత పవిత్రంగా భావించే లడ్డూను ఎందుకు అపవిత్రం చేసేలా పనిచేస్తారని ప్రశ్నించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న మూడు పార్టీల కూటమి ప్రభుత్వం వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు సిట్ విచారణ కాకుండా సీబీఐ లేదా సిటింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని ఆమె కోరారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సుహాసినీ ఎస్ గోత్మారే

అన్నవరం: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ (సికింద్రాబాద్) సుహాసిని ఎస్.గోత్మారే గురువారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. టాయ్‌లెట్స్ వద్ద విద్యుత్ దీపాలు, ప్లాట్ ఫాంపై ప్రయాణికులు కూర్చునే చోట ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బుకింగ్ కౌంటర్, రైల్వే క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత ఆమె రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆమెకు వేదాశీస్సులు అందజేయగా సత్యదేవుని ప్రసాదాలను రిసెప్షన్ సూపరింటెండెంట్ కంచి మూర్తి అందజేశారు. ఆమె వెంట అన్నవరం రైల్వే స్టేషన్ మాస్టర్ సతీష్, టీటీలు మోహనరావు, ప్రసాద్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు తదితరులు ఉన్నారు.

డ్వాక్రా సొమ్ము రూ.15 లక్షల స్వాహా

- కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలి చేతి వాటం
- బ్యాంకు మేనేజర్ పరిశీలనలో బయటపడ్డ నిజం

అంబాజీపేట: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు మంజూరు చేసిన రుణాలను గ్రూపు సభ్యులు తిరిగి చెల్లించే విషయంలో బ్యాంకు అధీకృత కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలు చేతివాటం ప్రదర్శించి రూ.15 లక్షలు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం...పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ కస్టమర్ పాయింట్ నెలకొల్పేందుకుగాను ఇంటిగ్రా కంపెనీకి అనుమతి ఇచ్చింది. ఈ కస్టమర్ పాయింట్‌లో బ్యాంకు పరిధిలో ఉన్న తొమ్మిది డ్వాక్రా సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాలను వాయిదాల రూపంలో ప్రతి నెలా నిర్వాహకురాలు పి.మణికి చెల్లిస్తున్నారు. ఆమె వాయిదాలను బ్యాంకుకు సక్రమంగా చెల్లించకపోవడంతో సొమ్ములు స్వాహా అయినట్టు ఆలస్యంగా గుర్తించారు. ఎవరికీ అనుమానం రాకుండా నిర్వాహకురాలు వాయిదా మొత్తాలను రెండు మూడు నెలలకు ఒకసారి ఒక్కొక్క గ్రూపు పేరున బ్యాంకులో జమ చేస్తూ అందరినీ నమ్మించింది. కొంతమంది మహిళా గ్రూపు సభ్యులు తమకు అదనపు రుణ మొత్తం కావాలని బ్యాంకు మేనేజర్ కె.సిద్ధార్థను సంప్రదించగా సదరు గ్రూపు మహిళలు రుణ మొత్తాలను చెల్లించలేదనే విషయం బయటపడింది. తాము కస్టమర్ పాయింట్ నిర్వాహకురాలికి చెల్లించామని మహిళలు బ్యాంకు మేనేజర్‌కు తెలపడంతో ఇదే విషయాన్ని మేనేజర్ ఇంటిగ్రా కంపెనీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇంటిగ్రా కంపెనీ క్లస్టర్ హెడ్ రఘుచంద్రన్ పుల్లేటికుర్రు చేరుకొని బాధిత మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి సమాచారం సేకరించాక ఎంత మొత్తం నిధులు స్వాహా అయ్యాయో ధ్రువీకరించుకుని అంబాజీపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై బ్యాంకు మేనేజర్ సిద్ధార్థ మాట్లాడుతూ తాను ఇక్కడికి వచ్చి కేవలం మూడు నెలలు మాత్రమే అయ్యిందన్నారు. అయినప్పటికీ డ్వాక్రా మహిళల సొమ్ములు స్వాహా అయినట్టు గుర్తించామని, మరిన్ని వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

గోదావరిలో మృతదేహం గుర్తింపు



నాయుడు సుబ్రహ్మణ్యం (ఫైల్)

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంక గోదావరి బ్యారేజి గేట్ల వద్ద నాయుడు సుబ్రహ్మణ్యం (33) అనే యువకుడి మృతదేహాన్ని బుధవారం రాత్రి కొవ్వూరు రూరల్ పోలీసులు గుర్తించారు. ఆ యువకుడు ఈ నెల 24న రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకి గల్లంతయ్యాడు. మోటార్ సైకిల్‌పై వచ్చిన సుబ్రహ్మణ్యం వంతెన 127 పిల్లర్ వద్ద బైక్‌ను విడిచి పెట్టారు. మోటారు సైకిల్‌పై 'జై గ్రంధి సిద్ధం' అనే స్టిక్కర్ అతికించి ఉంది. బైక్ నంబర్ ప్లేట్ ఆధారంగా గల్లంతైన వ్యక్తి భీమవరానికి చెందినవాడిగా అప్పట్లో కొవ్వూరు పట్టణ పోలీసులు గుర్తించారు. విచారణ అనంతరం మృతుడు భీమవరంలోని మోటుపల్లివారి వీధికి చెందిన కార్పెంటర్ నాయుడు సుబ్రహ్మణ్యంగా రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. సుబ్రహ్మణ్యానికి భార్యతో పాటు సత్యజ్యోతి, జగదీశ్వరి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కొంతకాలంగా భీమవరంలో ఉంటున్నాడు. వైఎస్సార్ సీపీలో చురుకైన కార్యకర్త అని చెబుతున్నారు. తల్లిదండ్రులను చూసేందుకు ఏడిద వెళ్లిన సుబ్రహ్మణ్యం తిరిగి బైక్‌పై భీమవరం వెళుతూ మార్గమధ్యలో ఈ అఘాయిత్యానికి పూనుకున్నట్టు భావిస్తున్నారు. మృతుడి తండ్రి నాయుడు వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణ తెలిపారు.

మాధవరాయుడుపాలెంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని ఓం శాంతి ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో అన్నందేవుల వీరబాబు ఇంటి వద్ద నిర్వహిస్తున్న కిరాణా జనరల్ స్టోర్, టీ షాపు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు, షాపు ఒకే చోట ఉండడంతో భారీ ఆస్తినష్టం జరిగింది. పంచాయతీ సర్పంచ్ అన్నందేవుల చంటి, స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు రాజమహేంద్రవరం అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు అంచనా.

బాలికపై అత్యాచారం చేసిన యువకుడి అరెస్టు

మండపేట: మైనర్ బాలికను వేధించడమే కాకుండా అత్యాచారానికి పాల్పడిన యువకుడిని గురువారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లికి చెందిన ఓ మైనర్ బాలికను రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన లోశెట్టి సతీష్ గత ఆరు నెలలుగా వేధిస్తూ ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ పీతల దొరరాజు తెలిపారు. రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు తన సిబ్బందితో దర్యాప్తు వేగవంతం చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఆలమూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ దొరరాజు తెలిపారు. కేసులో కీలకపాత్ర పోషించిన సీఐ, ఎస్ఐలతో పాటు సిబ్బంది జి.సత్యనారాయణ, గంగరాజు, రమేష్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భార్యను వేధించిన భర్తకు జైలు

రౌతులపూడి: భార్యను వేధించిన భర్తకు కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని బీబీపట్నం గ్రామానికి చెందిన జిగిరెడ్డి అక్కన్న పాత్రుడు గిడజాం గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఆమె 2022లో అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి అన్నవరం అడిషనల్ ఎస్ఐ బి.అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని రాజమహేంద్రవరం జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో ముద్దాయికి నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆర్.శ్రీలత గురువారం తీర్పు చెప్పారు.

ముగిసిన సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

- 354 మంది మహిళలకు పరీక్షలు
- 44 మందికి తొలగిన ప్రాణాపాయం



పింక్ ఎన్‌జీవో బృందంతో జీజీహెచ్ యాజమాన్యం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ గురువారంతో ముగిసింది. ఈ స్క్రీనింగ్‌లో 354 మంది మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 44 మందిలో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే ముప్పును ముందుగానే గుర్తించారు. దీంతో వారికి ప్రాణాపాయం తప్పింది. గుర్తించిన మహిళల్లో 40 మందికి థర్మోకోయగ్లేషన్ ద్వారా, ఇద్దరికి లీప్ ద్వారా చికిత్స నిర్వహించి అక్కడికక్కడే ప్రీ క్యాన్సరస్ లీజన్స్ తొలగించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఆర్ఎంసీ గైనకాలజీ, ఆంకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన పింక్ ఎన్‌జీవో బృందం ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేసింది. మహిళలకు పరీక్షలు చేసిన డాక్టర్ సమత, విదేశీ బృందాన్ని జీజీహెచ్ యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆంకాలజీ హెచ్‌వోడీ వాసన్, గైనికాలజీ హెచ్‌వోడీ అనురాగమయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

- విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు
- ఉత్సాహంగా పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 1800 మంది హాజరు



ఆర్చరీ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని క్రీడల్లో రాణించాలని విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు సూచించారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో గురువారం జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి అండర్–14, 17 క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఏడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు దోహద పడతాయన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో జరిగే ఎంపికలకు నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి మాట్లాడుతూ ఏడు క్రీడాంశాల్లో 1800 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు జిల్లా క్రీడామైదానంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. అనంతరం ఏడీ నాగేశ్వరరావును ఎస్‌జీఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ పోటీలకు హాకీ, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్, తైక్వాండో, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, టెన్నికాయిట్ క్రీడాకారులు 1800 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, కార్యదర్శి నూకరాజు, ట్రెజరర్ రవి సందర్‌కొర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి స్వామి, కె.పరశురాం, శ్రీనివాస్, వర్మ, డీఎస్ఏ కోచ్ సమీర్, జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, పీడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్ విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు